ఎండుగడ్డి ధర భగ్గు!



ఎండిపోయిన పొలాల్లో మేస్తున్న బక్కచిక్కిన ఆవులు

- భారంగా మారిన పశుపోషణ
- పోషించలేక పశువుల విక్రయం
- కరవుతో అల్లాడుతున్న గ్రామీణులు



సుదూర ప్రాంతాల నుంచి ఎడ్లుగడ్డిని కొనుగోలు చేసి తీసుకొస్తున్న పశుపోషకులు

బాపట్ల: మండలంలోని కొత్తమద్దిబోయినవారిపాలెం గ్రామానికి చెందిన వల్లు తిరుపతయ్య ఏటా రెండు ఎకరాలలో వ్యవసాయం చేసేవారు. మరో రెండు ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి దాంతో మూడు పాడిగేదెలను మేపుతూ జీవనం సాగిస్తుండేవారు. గత రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆ పొలాల్లో నాట్లు వేయలేదు. దీనికి తోడు కూలీలను తగ్గించుకునేందుకు యంత్రాలతో కోతలు కోయించటం వలన గడ్డి దొరకడం లేదు. ప్రస్తుతం గేదెలను పోషించాలంటే నాలుగు ఎకరాలు గడ్డిని బయట నుంచే కొనుగోలు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎకరం గడ్డి రూ. 16 వేల వరకు ధర పలుకుతోంది. దీంతో రూ.64 వేలు



బాపట్ల నుంచి కటికశాలకు తరలిపోతున్న గేదెలు

వెచ్చించాల్సి వచ్చింది. వీటితోపాటు దాణా, తవుడు ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఏడాదిపాటు అదే రీతిలో పోషించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పశువుల పోషణ భారంగా మారడంతో మూడు గేదెలను వ్యాపారులకు విక్రయించి కూలి పనులకు వెళ్తున్నారు. ఇదే విధంగా మండలంలోని మరుప్రోలువారిపాలెం, అసోదివారిపాలెం, ముత్తాయపాలెం, బసివిరెడ్డిపాలెం, వల్లువారిపాలెం, నరసాయపాలెం, కంకటపాలెం, జమ్ములపాలెం, వెదుళ్ళపల్లి, బేతపూడి, పాండురంగాపురం గ్రామాల నుంచి రోజుకు సుమారు 10 నుంచి 40 గేదెల మేరకు కటిక శాలలకు తరలివెళ్తున్నాయి. బాపట్ల మండలంలో గేదెలు 11600, ఆవులు 3200, గొర్రెలు 11200, మేకలు 1200 ఉన్నాయి.

సమస్య వచ్చిందిలా...

ఏటా సకాలంలో నాట్లు వేయడం వల్ల గడ్డి కూడా పుష్కలంగా ఉండేది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వలన కొంతమేర భూములు సాగుకు దూరం కాగా, నీటి సౌకర్యం లేక మరి కొన్ని పొలాలు బీడులుగా మారాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే అడవిలో పచ్చిమేత సమృద్ధిగా లభిస్తుండేది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పశువులు పొలాల్లో తిరిగి వచ్చేవి. కేవలం సాయంత్రం మాత్రమే ఎండుగడ్డిని మేపేవారు. అయితే ప్రస్తుతం వర్షాలు పడకపోవడం, ఉదయం నుంచి సాయంత్రం వరకు వెచ్చని వడగాలలు వీస్తుండటంతో అడవిలో, పొలాల్లోని పచ్చిక మేత సైతం మాడిపోతుంది. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అడవిలో తిరిగినప్పటికీ పశువులకు కడుపు నిండిన దాఖలాలు లేవు. ప్రతిరోజు గేదెలను ఇంటి వద్దే కట్టేసి మేపాల్సి రావడం, ఒక్కో గేదెకు రోజుకు రెండు కట్టల గడ్డి వేయాల్సి వస్తోంది. దీంతో పశుపోషకులు బెంబేలెత్తిపోతున్నారు.

పశువులకు విక్రయిస్తున్నాం



ప్రస్తుతం పొలాల్లో పచ్చిక మేతలు లేవు. ఎండుగడ్డి కొనుగోలు చేయాలంటే ధరలు భగ్గుమంటున్నాయి. ఉన్న పొలాలు రియల్ఎస్టేట్, నీటిసౌకర్యం లేని కారణంగా బీడులుగా మారాయి. చేసేది లేక ఉన్న మూడు గేదెలను విక్రయించా. – వల్లు తిరుపతిరావు, కొత్తమద్దిబోయినవారిపాలెం

భారంగా మారింది



గతంలో వ్యవసాయంతోపాటు నాలుగైదు పాడిగేదెలను పోషించేవాళ్లం. ప్రస్తుతం రెండేళ్లుగా నాట్లు పడకపోవడంతో వ్యవసాయం కలిసిరావడం లేదు. దీంతో బయట రూ. వేలు వెచ్చించి గడ్డి కొనుగోలు చేయాల్సి వచ్చింది. దీంతో పశుపోషణ భారంగా మారింది. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిరోజు గేదెలు కటికశాలలకు తరలి వెళ్తూనే ఉన్నాయి. – మరుప్రోలు ఏడుకొండలు రెడ్డి , మరుప్రోలువారిపాలెం

క్లుప్తంగా

పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ మంగ



రేపల్లె రూరల్: పట్టణాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అజెండాలోని 20 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కమిషనర్ సాంబశివరావు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను నెలాఖరులోగా చెల్లించాలి

రేపల్లె రూరల్: విద్యుత్ రెవెన్యూ కార్యాలయ కౌంటర్ ఆదివారం, సోమవారం పనిచేస్తుందని ఆ శాఖ డిప్యూటీ ఈఈ డి.శ్యామ్ సుధాకర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ పాత బకాయిలు, ఈ నెలలో ఇచ్చిన బిల్లులు చెల్లించేందుకు ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. నెలాఖరులోపు బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు.

పౌర హక్కుల పరిరక్షణ ముఖ్యం



జంపని(వేమూరు): పౌర హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర అన్నారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలోని దళితవాడలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి వ్యక్తికి హక్కులు కల్పించిందన్నారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సాయి, వీఆర్వో సీతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధిలో గురువులే కీలకం



నిజాంపట్నం: విద్యార్థుల సమగ్రాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మండల విద్యాశాఖ అధికారి ఆర్.శోభాచంద్ అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా శనివారం ప్రజ్ఞం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల సందేహాలకు సహనంతో సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించి ప్రతి పనిని రికార్డులలో నమోదు చేయాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 శేషుగోపాలం, ప్రధానోపాధ్యాయుడు పి.ఏడుకొండలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత ముఖ్యం



కర్లపాలెం: వేసవికాలంలో జరిగే అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ కర్లపాలెం మండల చైర్మన్ ఇనకొల్లు పోలీసరావు చెప్పారు. దమ్మనవారిపాలెంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహం దగ్ధమైన అర్జునరావు కుటుంబానికి రెడ్‌క్రాస్ సహకారంతో తాత్కాలిక గుడారానికి టార్పాలిన్ పట్ట, వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు కృష్ణమూర్తి, సాంబయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

చట్టానికి అందరూ సమానులే



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఇందిరాప్రియదర్శిని

తెనాలిరూరల్: చట్టానికి అందరూ సమానులేనని, బాలలకు రాజ్యాంగం, చట్టం కల్పిస్తున్న ప్రత్యేక హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం. ఇందిరాప్రియదర్శిని అన్నారు. బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో యాక్టు)పై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నందివెలుగులో న్యాయవిజ్ఞాన సస్సును శనివారం సాయంత్రం నిర్వహించారు. న్యాయమూర్తి ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడినా, ప్రేరేపించే పనులు చేసినా, అసభ్యంగా ప్రవర్తించినా, తాకినా పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులను నిరోధించేందుకు 2012లో ఈ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈ చట్టం 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందని, వారిపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్షలతో పాటు మరణశిక్ష కూడా విధిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బేతాళ ప్రభాకర్, హరిదాసు గౌరీశంకర్, రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్, కోఆర్డినేటర్ యర్రంశెట్టి అనిల్‌కుమార్, ఎంపీటీసీ టి. విజయలక్ష్మి, నాగళ్ల హరీష్, శ్రీనాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నదిలో గాలు మార్గం నిలిపివేత



జేసీబీతో గండి పెడుతున్న ఆర్‌సీ అధికారులు

కొల్లూరు: కృష్ణా నదిలో అక్రమంగా గాలు మార్గం ఏర్పాటు చేసి నగదు వసూళ్లు చేస్తుండటంతో ఆర్‌సీ అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని గాజుల్లంకలో కృష్ణా నదిలో కృష్ణా-బాపట్ల జిల్లాల నడుమ కూటమి నాయకులు నిబంధనలకు విరుద్ధంగా గాలు మార్గం ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలు సాగించినందుకు నగదు వసూళ్లు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఇలా నగదు వసూళ్లు చేయడంపై ఆర్‌సీ (రివర్ అండ్ కన్జర్వేషన్) అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో శనివారం రాత్రి నదిలో ఏర్పాటు చేసిన గాలు మార్గాన్ని పరిశీలించిన ఆర్‌సీ అధికారులు గాజుల్లంక వద్ద గండి ఏర్పాటు చేశారు. దీనితో ఇరు జిల్లాల నడుమ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అక్రమంగా గాలు మార్గం ఏర్పాటు చేసి నగదు వసూళ్లు చేపడితే చర్యలు చేపడతామని ఆర్‌సీ కొల్లూరు, తోట్లవల్లూరు సెక్షన్ జేఈలు విజయరాజు, జనార్దన్‌లు హెచ్చరించారు.

ట్రాఫిక్ సిబ్బందికి టోపీలు–మాస్కులు వితరణ



ట్రాఫిక్ పోలీసులకు వస్తువులు అందజేస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ మొవ్వా విజయలక్ష్మీ స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం తెనాలిలోని ట్రాఫిక్ విధుల్లో ఉండే 20 మంది పోలీస్ సిబ్బందికి వివిధ వస్తువులను అందజేశారు. వేసవి కాలం దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసులకు అవసరమైన చలువ కళ్లద్దాలు, కూలింగ్ వాటర్ బాటిల్స్, టోపీలు, సర్జికల్ మాస్కులను పంపిణీ చేశారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్థ తరపున వితరణను ఆయన చేతులమీదుగా ట్రాఫిక్ సిబ్బందికి బహూకరించారు. మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి వ్యవస్థాపకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మొవ్వా సత్యనారాయణ సమాజానికి చేస్తున్న సేవలను అభినందించారు. పలు సేవల్లో తాను స్వయంగా పాల్గొన్నానని చెబుతూ, ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసు సిబ్బంది కోసం అందించిన సహకారంపై సంతోషం వ్యక్తంచేశారు. సేవాసమితి అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ మాట్లాడుతూ మండుటెండలో పనిచేసే ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి తమ వంతు బాధ్యతగా సహకారం అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ బ్రహ్మయ్య, ట్రాఫిక్ పోలీసులు, అతిథులు మొవ్వా రఘుబాబు, కొరటాల జ్ఞానేంద్రప్రసాద్, ఈశ్వర్ చంద్, కోటయ్య, చలమయ్య, రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తెనాలిలో జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు



తెనాలిరూరల్: తెనాలి, వేమూరు నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన, పశుపాల, వ్యవసాయ వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడు తూ ఎడ్ల పరదర్శనలు తెలుగు సంస్కృతిలో భాగమని చెప్పారు. ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పరుచూరి అశోక్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షులు ఎంపిక

బాపట్ల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగాల అధ్యక్షుల నియామకం చేపట్టారు. బాపట్ల నియోజకవర్గానికి ఎం.పాపారావు, రేపల్లె నియోజకవర్గానికి తుమ్మా రవికుమార్‌రెడ్డి, వేమూరుకు బి.మోషే, చీరాలకు నక్కా పోలేష్‌లను నియమించారు. పలువురు వారికి అభినందనలు తెలిపారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి



కర్లపాలెం: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. పేరలి గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు 1వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రంలోపు పంపిణీ చేయాలని ఆదేశించారు. మండలంలో 7,634 మందికి వివిధ రకాల పింఛన్లు తీసుకునే వారున్నారని తెలిపారు.

తాడిచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

చెరుకుపల్లి: తాడిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చెరుకుపల్లి మండలం ఆళ్ళవారిపాలెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం మేరకు... గ్రామానికి చెందిన సుంకర నాగరాజు (39) పందిరి వేసేందుకు తాటాకులు కోసం తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి అచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తుననట్లు తెలిపారు.


పొరపాటున అశోక్‌బాబు పేరు చెప్పాను



నక్కల నారాయణ

బాపట్ల టౌన్: బాపట్ల మండలం, కంకటపాలెం గ్రామానికి చెందిన నేను ఈ ఏడాది నా పొలంలోని ధాన్యాన్ని మా గ్రామానికి చెందిన లలితబాబుకు విక్రయించాను. లలితబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నెల 24న నేను పొరపాటున నా పొలంలోని ధాన్యాన్ని నరసాయపాలెం గ్రామానికి చెందిన అశోక్‌బాబుకు విక్రయించానని చెప్పడం జరిగింది. నాకు వాస్తవంగా డబ్బులు ఇవ్వాల్సింది లలితబాబు.

డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు అవార్డు



డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యం

తెనాలి: కెనడా దేశానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు షారోన్ పేరిట ఏటా అందిస్తున్న 'షారోన్ స్మారక అంతర్జాతీయ సేవ అవార్డ్' 2025 సంవత్సరానికి ప్రముఖ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు ప్రదానం చేయనున్నారు. పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి శనివారం సాయంత్రం రూరల్ మండల గ్రామం పెదరావూరులోని సంస్థ కార్యాలయంలో వివరాలను తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా ఎన్నో క్లిష్టతరమైన ఆపరేషన్లను చేసిన డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేశారని తెలిపారు. పెన్నీ మినిస్ట్రీస్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవాసంస్థ తరపున ప్రతిభావంతులైన సేవానిరతిగల ప్రముఖులను జ్యూరీ ఎంపిక చేసి ప్రతిఏడాది 'షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డుతో సత్కరిస్తోందని ప్రదీప్ తెలిపారు. ఇంతకుముందు డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ డి.శారద, చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ యశోధ రకుఈ అవార్డును బహూకరించామని గుర్తుచేశారు. త్వరలో తెనాలిలో ఏర్పాటుచేసే ప్రత్యేక సభలో డాక్టర్ సుబ్రహ్మణ్యంకు అవార్డును ప్రదానం చేస్తామని వివరించారు.

ఉద్యోగ సంఘం నేతల హర్షం

దుగ్గిరాల: జీపీఎఫ్ నిదులు విడుదల చేయటంపై ఉద్యోగ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల నాయకులు అందె బాల చంద్రమౌళి సీఎం చంద్ర బాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభు త్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయి మొత్తం రూ.7,300 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఎంపీపీ జబీన్, ఎంపీడీఓ శ్రీనివాస రావు, జి.పూర్ణప్రసాద్,మురళీకృష్ణ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం

తెనాలిటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని విద్యుత్ స్తంభం ధ్వంసమైన సంఘటన స్థానిక కొత్తపేటలోని రెడ్‌క్రాస్ బిల్డింగ్ వద్ద చోటు చేసుకుంది. విద్యుత్ ఏఈ దుర్గారావు కథనం మేరకు.. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం కరెంటు స్తంభాన్ని ఢీకొట్టినట్లు చెప్పారు. ప్రమాదంలో స్తంభం పూర్తిగా ధ్వంసం కాగా, స్థానికుల సమాచారంతో ఆ ప్రాంతానికి చేరుకుని మరమ్మతులు చేపట్టి నూతన స్తంభం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. పరిసరాల్లోని విద్యుత్ వినియోగదారుల కు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా త్వరి తగతిన పని పూర్తి చేసినట్లు వివరించారు.

భూసార పరీక్షలు చేయించాలి



అవగాహన కల్పిస్తున్న డీన్ డాక్టరు పి.ప్రసూనరాణి

బాపట్ల: రైతులు భూసార పరీక్షలను క్రమం తప్పకుండా చేయించాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూన రాణి అన్నారు. వ్యవసాయ కళాశాలలో ఐ.సి.ఎ.ఆర్. ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా నేలల ఆరోగ్యం, పునర్జీవం, భూసార ఆవశ్యకతలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడారు. జీవ ఎరువుల ఉపయోగాల గురించి వివరించారు. భూమిలో పోషక యాజమాన్యం, పచ్చిరొట్ట పైరుల ఆవశ్యకత గురించి డాక్టర్ ఏజే సువర్ణ లత ప్రసంగించారు. విభాగాధిపతి డాక్టర్ ఎం.లత మట్టి నమూనా సేకరణ విధానాలను తెలియజేశారు. డాక్టర్ కే హేమ, డాక్టర్ పి. మోహనరావు, డాక్టర్ కె.నాన్సీ జాస్మిన్ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఎ.జె.సువర్ణ లత, ఏఈఎల్‌పీ విద్యార్థులు నిర్వహించారు. జమ్ములపాలెం, రేటూరు అప్పాపురం, కంకటపాలెం, బాపట్ల నుంచి రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న బాపట్ల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి

బాపట్ల: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బాపట్ల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి పేర్కొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ బాలికల హైస్కూలులో విద్యార్థులకు పోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జి.వాణి మాట్లాడుతూ లైంగిక వేధింపులు, అశ్లీలత వంటి నేరాల నుంచి పిల్లలను రక్షించాలని సూచించారు. పలు కేసుల్లో నేరాలను విచారించేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని తెలిపారు. సదస్సులో న్యాయవాదులు ఊట్ల రామారావు, జి.ఎస్.నాగ మోహిని తదితరులు ఉన్నారు.